# నీడ

కొడుకలా అంటాడని కలలోకూడా అనుకోలేదు రామిరెడ్డి. ఆ మాటలు విన్నప్పటినుంచి మనసులో లేదతనికి. తననెవరో పాతాళానికి తొక్కుతున్నట్లు, గుండెను వాడి బాణాలతో తూట్లు వేస్తున్నట్లు విలవిలలాడుతున్నాడు.

కోడలు కుర్చీలో కూర్చోబెట్టి కమ్మటి కాఫీ ఇచ్చింది. కోడలుకు తనపైన పుట్టిన అకారణ అభిమానానికి ఆనందించాడు. ఆ ఆనందపు అనుభూతినుంచి తేరుకోకముందే బాంబులాటి విషయాన్ని పేల్చారు ఆలుమగలు. అది తలచుకొంటూంటే రామిరెడ్డిలో బాధ సుడులు తిరుగుతోంది. అవే ఆలోచనలు అంతకంతకు పెరుగుతుండడంతో, పల్చటి దుఃఖపు తెరలు ప్రారంభంకాసాగాయి. ఆ ఆలోచన్లనుంచి దూరం కావడానికన్నట్లు పైగుడ్డ తీసి భుజంమీద వేసుకొని మడివేపు బయల్దేరాడు.

ఐదున్నరడుగుల పొడవు, కాయకష్టపు దేహం. వయసు అరవై ఐదు. వార్థక్యపు గుర్తుగా ముఖంలో ముడుతలు, తలలో తెల్ల వెంట్రుకలు. చేతికి కర్ర రాకపోయినా నడుము కాస్త వంగింది. చకచకా నడుస్తున్నాననుకొంటున్నాడు రామిరెడ్డి. కానీ అడుగులు అనుకొన్నంత జోరుగా పడడం లేదు.

"ఏం మామా.. ఒంట్లో బాగలేదా?" దార్లో ఎదురుపడిన నారాయణ అడిగాడు.

"దిగపొద్దు పడిపోలేదంట్రా... నీమాదిర్తో ఉండాలంటే అవుతుందా" అన్నాడు బలవంతంగా నవ్వును ముఖాన పులుముకొంటూ.

"దిగపొద్దా... నీకా?! నిన్నంతా చిన్నపిలగోడి మాదిరి సంబరంగా ఉంటివి. కొడుకు మిట్టీనుంచి ఇంటికొచ్చేసి నాడనేలకు నిన్ను పట్టనలివి గాలేదే. ఈపొద్దు అదొక మాదిర్తా ఉంటే అడిగితిలే. వస్తా.. నాకు పనుంది" అంటూ వెళ్లిపోయాడు.

రామిరెడ్డి తిరిగి నడక కొనసాగించాడు. నడీధి మలుపు తిరిగి, దిగవీధి దాటి 'ఇప్పలకుంట' చెరువు కట్టమీద నడవసాగాడు.

'చిన్నప్పుడు ఈ చెరువు ఎంత నిండుగా ఉండేది. ఎండాకాలంలో మాత్రం నీళ్ళు అడుక్కుపొయ్యేటియి. కార్తీకము, వైశాఖమంతా నీళ్ళు నిండుగా ఉండి రెండుకార్లు పంటలు బంగారంలా పండేటియి. అదో.. చాకిరేవు. ఆడోళ్ళు మోకాళ్ళపైకి కుచ్చిళ్ళు ఎగచెక్కి నీళ్ళల్లో

దిగి ఉస్సో ఉస్సో అంటూ గుడ్డలుతికేటోళ్ళు. పిల్లకాయలు వంటిమీద గుడ్డల్లేకుండా ఈదులాడేవాళ్లు. ఇప్పుడయన్నీ యాదుండాయి. వానల్లేక జల అడుగంటె...బాయిలు ఎండబట్టె....బోర్లు ఎయ్యబట్టిరి. వానలొచ్చి చెరువునిండినా రెండునెల్లుగూడా ఉండవు నీళ్ళు. తమకేం ఇబ్బంది లేదులె. గంగలాంటి బాయి. రెండెకరాలమడి, వాడెందుకలాంటి నిర్ణయం తీసుకున్నాడు?'

రామిరెడ్డి మనసు వికలమయింది. ఎంతవద్దనుకున్నా, ఆ ఆలోచన్లను మరవాలని ఏవేవో జ్ఞాపకంచేసుకొన్నా మళ్ళీ అక్కడికేవచ్చి ఆగుతోంది మనసు. రామిరెడ్డికి పద్దైదేండ్ల కిందటి సంఘటనలు గుర్తుకు రాసాగాయి.

"ఓ సుబ్బయ్యా.... ఆ గొడ్డునట్లా అదిలించు...దొంగయిపోతాంది. దీంతో నా పరువు పోయేట్లుంది. దొంగలతోలేస్తే పోతాది. దీంతో ఏగలేం" అన్నాడు రామిరెడ్డి చేన్లో పడబోతున్న కర్రావును చూసి.

సుబ్బయ్య "హయ్..హయ్‌హయ్...." అంటూ రాయి విసిరి "అన్నీ తెలిసిన మనుషులే దొంగలయితాంటె గొడ్లదేముండాదిలే రామా. అయ్యి దొంగతనం జేసినా ఏంచేస్తాయి? కడుపుకు తిండేకదా! అదే మనిషి... ఎందర్ని ఎన్ని రకాలుగా ఏమారస్తాడు. ఎంతెంత కూడబెడతాడు" అన్నాడు పారతో మట్టిని తీసి నీళ్ళను మరొకవైపునకు మళ్ళిస్తూ.

"నిజమేరోయ్ సుబ్బా.. మంచిమాట చెప్పినావు. పక్కూరిశెట్టి చూడు, అవసరంలో ఆదుకొంటాడా. నిమ్మళంగా వాళ్ళుండే ఇంటికో, చేనుకో, మడికో ఎసరు పెడ్తాడు. ఇప్పుడు వాళ్లకుండాయే, ఆ భూములన్ని అట్ల సంపాయించినయే గదా? రెండు వడ్లమిషన్లు, సినిమాటెంటు ఆ దుడ్డుతో కట్టిచ్చినోటియేగదా" అన్నాడు సుబ్బయ్య మాటలకు బలాన్ని చేకూరుస్తున్నట్లుగా.

"శెట్టిగాడు రామా లోకంమీద యాడన్నా జూడు. ఎవడన్నా మిద్దెలు మేడలు కడతాండాడన్నే, పొలంబుట్రా కొంటాండాడన్నే ఎదుటోళ్ళ నెత్తిన చెయ్యి పెట్టింటేనే. ఎవురో....నూటికి ఒకరూ ఇద్దరే ధర్మంగా సంపాదించేది." అన్నాడు నీళ్ళ వెంట తనూ నడుస్తూనే సుబ్బయ్య.

"అదో.. దొంగనాయాలి గొడ్డు... మళ్ళా వస్తాంది చూడు. హయ్... హయ్..." అంటూ తనే రెండురాళ్లు తీసుకొని విసుర్తూ దానివైపు వెళ్లసాగాడు రామిరెడ్డి.

"అన్నో... ఓరామిరెడ్డన్నో... నీకొడుక్కు ఉద్యోగం వచ్చిందంటనే" అవరచాడు అంతదూరంనుంచే క్రిష్ణారెడ్డి.

క్రిష్ణారెడ్డి సన్నగా ఎదురుగడలా ఉంటాడు. మాటలు మాత్రం మైలుదూరం వినిపిస్తాయి.

"వాడికేం ఉద్యోగం వస్తాదిరా... పెద్దపెద్ద చదువులు చదివినోళ్లకే రాలేదే" అన్నాడు

రామిరెడ్డి. ఎదురుగాలికి ఇతని మాటలు అతనికి విన్పించలేదు. క్రిష్ణారెడ్డి దగ్గరికొస్తూనే "నీకొడుక్కు మిల్ట్రీలో ఉద్యోగం వచ్చిందంట" అన్నాడు.

"తమాసలు పడను నేనే దొరికినానా"

"నీతో నేనెందుకు తమాసలు పడతాన్నా. నాగిరెడ్డి ఉద్యోగం వచ్చిందని ఊరంతా దండోరా ఏస్తాంటె... పేపరెత్తుకొని" అన్నాడు.

"నువ్వు జూస్తివా"

"చూస్తి... నీకు తెలుసుగదా.. నాది గోడకింద చదువని. పోస్టు రామచంద్రయ్యవచ్చి ఇచ్చినాడంట. ఊరంతా ఉద్యోగం గురించే చెప్పుకొంటాండారు" అంటూ వెళ్లిపోయాడతను.

"ఏం రామా... ఏం తక్కువని కొడుకుని మిల్ట్రీకి పంపతాండావు" అడిగినాడు సుబ్బయ్య.

"నేనెందుకు పంపతాను సుబ్బా... నాకు తెలీకుండానే వాడే ఏదో చూసుకొన్నేడు. ఇంటికిపోతాండా" అన్నాడు గొడ్లను అదిలిస్తూ.

"ఇంగా అంత పొద్దుండే. అప్పుడే ఏం తొందరొచ్చింది"

"పోవాల... మనసదొక మాదిర్తొ అయిపాయ. వాని ఉద్యోగం సంగతి చూడాల" అంటూ గొడ్లను ఇంటికి మళ్లించాడు.

'పెండ్లయిన రెండేండ్లకు కూతురుపట్టింది. మొగనలుసు కోసం ఎన్నో మొక్కులు మొక్కితే ఐదేండ్లకు కొడుకు పుట్టినాడు. ఆపైన పిల్లల్లేరు. కూతురుకు పెండ్లిచేసి అత్తవారింటికి పంపి ఆరేండ్లయింది. కంటికెదురుగా కనబడతాండేది వీడొకడు. చదువుకోరా అంటే ఇనకపాయ. కాలేజీ చదువు సగంలో ఆపేస. ఏదో తనకు తోడుగా ఉండి సేద్దిం చేస్తాడ్లే అనుకొంటె ఇప్పుడీ పాట పాడతాండాడే. తమకేం తక్కవని మిల్ట్రీకి పోతానంటాండాడు. మిల్ట్రీకి పోయినోళ్ల సంగతి తనకు తెలీదా? ఎంతమంది ఆడ్నే చావడంలేదు, కాలు చెయ్యి ఇరిగిపోయి ఇంటికి రావడం లేదు'

రామిరెడ్డి ఆలోచనల్లో ఉండగానే అలవాటు పడిన గొడ్లు నేరుగా ఇంటిని చేరి కుడితి తొట్టికి మళ్లినాయి.

"ఏయ్... ఏమేయ్...." భార్యను కేకేశాడు.

"ఆఁ.... పొయ్యికింద మంటేస్తాండా" అంటూ లోపలనుంచే సమాధానమిచ్చింది పద్మావతమ్మ.

గొడ్లు కుడితి తాగనిచ్చి గాట్లో వాటిని కట్టేసి లోపలకొచ్చాడు రామిరెడ్డి.

పొయ్యిలోమంట ఎర్రగా ధగధగా వెలుగుతోంది. కొండలమీద సూర్యుడు తళతళలాడుతున్నాడు. పొయ్యిమీద పాత్రలో అన్నం కుతకుత ఉడుకుతోంది.

తదేకంగా భార్యనే చూశాడు. భర్తవైపు చూస్తే మాట్లాడాల్సి వస్తుందనో ఏమోమరి,

మండుతున్నపొయ్యిలో కట్టెలు కలబెడుతుంది. ఊదనబుర్రతో ఊదుతుంది. గరిటెతో కాగుతున్న ఎసరు కలబెడుతోంది. తన ఉనికిని గమనించని భార్యమీద, కంటికి కన్పించని కొడుకుమీద – అప్పటికే ఉన్న కోపం మరింత పెరిగింది. మంచాన్ని విసురుగా వాల్చి కూర్చొంటూ "యాడ్నే వాడు" రౌద్రంగా అడిగాడు రామిరెడ్డి.

"ఊరుమీద ఊరేగను పోయినాడుబో" అందితనూ అంతే కోపంగా.

"పోతాడు పోతాడు... అమ్మ ముదిగారం చేస్తే వాడు ఊరిమిందే గాదు, దేశం మీదగూడా పోతాడు. నీళ్లు తే" భార్యకు పురమాయించి పైగుడ్డ తీసి ఒళ్లో ఏసుకొన్నాడు.

"ముంచుకొని తాగు. అన్నం ఉడకతాండ్లా" అంది గరిటెతో కలబెడ్తూ.

"ఏమే పొగరెక్కువైందే... కొడుకు మాదిర్తా... ఇంటికొచ్చిన మొగోనికి నీళ్లిచ్చే తీరిగ్గూడా లేదా" అన్నాడు కోపంగానె.

"ఎనకటికెవడొ అత్తమీద కోపం దుత్తమీద చూపించినాడంట. అదేందో నీ కొడుకుమీద చూపించు. బాగుపడతాం" అంటూ లేచి చెంబుతో కుండలోని నీళ్లు తెచ్చి విసురుగా అతని చేతికిచ్చి వెళ్లి పొయ్యిముందు కూర్చుంది.

"వాడు నాకు పుట్టినోడే, నేనుగాదు వాడికి పుట్టిందేది. రానీ వాని పనిచెప్తా. మిల్ట్రీకి పోతాడా నాకొడుకు. ఏం తక్కవంట ఈడ. కూడా... గుడ్డా..." చెంబు చేత్తో పట్టుకొనే మాట్లాడుతున్నాడు.

"నీకెవరు చెప్పిరి"

"ఊరంతా ఈడు పలకెత్తుకొని దండోరా ఏస్తాంటె ఒకరేంది, ఎవ్వరైనా చెప్తారు. అప్పుడే సుబ్బయ్య ఏమన్నేడో తెల్సా? ఏం తక్కువని కొడుకుని మిల్ట్రీకి పంపతాండావు అనే మొగంమిండె. ఇంగ ఈడు పొయ్యినాడంటె ఎవురెన్ని మాట్లంటారో" అని చెంబులోని నీళ్లు గటగటా తాగేశాడు.

"చెట్టు ముదిరేలకు కుక్కమూతి పిందెలంట. ఈడు మనిషి పెరిగేలకు బుద్ధి తగ్గతాండాదె" అంది గంజి వంచుతూ.

"రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్లమీద నడుస్తాదంట. ఈ నాకొడుక్కు పరీక్ష ఎన్నిసార్లు పొయినా మనమేం అనలాగదా. కడీధిలో బలిజోళ్ల పిల్లతో తిరగతాన్నే... ఏదో పోనీలే... వయసుదుల అని గమ్మునున్నేమే. అందుకు అలుసయిపోయినాం. దేనికయినా అద్దూపద్దూ ఉండాల. లేకుంటే ఎట్లా"

"ఏంది నాయినా... అమ్మా నువ్వూ ముచ్చట్లాడుకొంటాండారా.." అంటూ వచ్చాడు నాగిరెడ్డి.

"ఆ...కొడుకు కుచ్చుల కుళ్లాయి పెట్టినాడని సంతోషంతో ముచ్చట్లాడుకొంటాండాము." అంది పద్మావతమ్మ.

"పెట్టేదానికే గదా నేను మిల్ట్రీకి పోతాండేది"

"మాకేం అక్కరలేదు. రైతుగా బతికితేచాలు. నువ్వుగూడా నోర్మూసుకొని ఇంట్లోపడుండు. సమ్మందాలు వస్తాండాయి. హాయిగా పెళ్లిచేసుకొని సేద్దించేసుకో" అన్నాడు రామిరెడ్డి.

"నావల్ల కాదు సేద్దిం"

"నీవల్లగాకపోతే మనసలపెట్టి చేయించుకో... అంతేగాని మిల్ట్రీకి పోతానంటే మేమొప్పుకోము" అనునయంగా అన్నాడు రామిరెడ్డి.

కొడుకును చూడగానే అంతకుముందు వరకు ఉన్న కోపమంతా తగ్గిపోయింది. మొదట్నుంచి అతనంతే. కొడుకెన్ని అతిపనులు చేసినా ఎదురుపడినాడంటే ఇతన్లోని కోపమంతా ఎగిరిపోతుంది.

"నువ్వింగా పదిరివై ఏండ్లు కష్టపడతావు గదా నాయినా. నేనంతలోపే తిరిగొచ్చేస్తా. ఎంత పదైదేండ్లే... ఆపైన ఎవ్వరం కష్టపడాల్సినపనే ఉండదు" అన్నాడు తండ్రికి నచ్చచెబుతున్నట్లుగా...

"కమ్మారపల్లెలో కుంటిచేతి రామిరెడ్డిని చూడలేదంట్రా... మిల్ట్రీకి పొయ్యే కదా అయన చేయిపోయింది. మా మాటిను. ఆ సంపాదనొద్దు. ఆ సుఖమూ వద్దు" అంది పద్మావతమ్మ.

తల్లీ తండ్రి ఎంతగా చెప్పినా విన్లేదు నాగిరెడ్డి. మిలటరీలో చేరిపోయాడు. అప్పట్నుంచి అతని రాకకోసం ఎదురుచూడని క్షణం లేదు. ఎప్పుడేమౌతుందో అని భయపడని దినం లేదు. ఒకసారి శెలవుల్లో పెండ్లి చేసుకొని భార్యను కూడా తీసుకెళ్లాడు.

"పెదరెడ్డీ... ఈ లోకంలో ఉన్నెట్టు లేవే" పలకరించాడు రామయ్య.

ఆలోచనలు అనేక సంవత్సరాల వెనక్కు పరుగులు తీసినా, అలవాటుపడిన కాళ్లు యాంత్రికంగా మడివద్దకే వచ్చాయి. ఆలోచన్లనుంచి తేరుకొని పచ్చదనంతో కళకళలాడుతున్న వరిపైరును, పైరు బాగుండడంతో కళకళలాడుతున్న రామయ్య ముఖాన్ని పరిశీలనగా చూశాడు. రామయ్యను, మడిని చూస్తుంటే కొడుకన్న మాటలు మళ్లీ గుర్తుకు రాసాగాయి.

"ఎందుకు రెడ్డీ అట్లా చూస్తాండావే" అడిగాడు.

రామిరెడ్డి మౌనంగా నడచుకొంటూ వెళ్లి బాయి షెడ్డు దగ్గర బండ మీద కూర్చొన్నాడు. అతనప్పుడప్పుడు కొడుకు మీద బెంగతోవచ్చి అక్కడ కూర్చోవడం మామూలే, కాబట్టి మడికి నీళ్లుపెట్టే కార్యక్రమంలో మునిగిపోయాడు రామయ్య.

తూర్పున చంద్రుడు కొండలమధ్య మొలుస్తున్నాడు. రామిరెడ్డిని పాత జ్ఞాపకాలు తొలుస్తున్నాయి.

కొడుకు మిల్ట్రీకి పోయిన ఐదేండ్లకు భార్య పోయింది. భార్యాభర్తలు ఒకరికొకరు ఆసరాగా ఉండడంతో కొడుకులేని దిగులును కొంతలోకొంత మరిచి పోయేవాళ్లు. ఒంటరితనం

ఎక్కువయింది. మానసిక జబ్బు చాలా పెద్దజబ్బేమో, ముందులాగ పనులు చేయలేకున్నాడు. అప్పట్నుంచి రామయ్య కౌలుకు చేస్తున్నాడు. నాగిరెడ్డి తండ్రిని బలవంతంచేశాడు తమ దగ్గర ఉండమని. అందుకతను ఒప్పుకోలేదు.

"యాడేడ తిరిగినా దూడ తల్లిదగ్గరికి పాలకొచ్చినట్టే, మనంగూడా ఏ ఊళ్లలో ఉన్నా మళ్లా మనూరికి రావల్సిందే గదా. నేను రాను... ఇంకెంత పదేండ్లేకదా మీరొచ్చేయరా" అన్నాడు రామిరెడ్డి.

నాగిరెడ్డి మాటసామెతకు పిల్చాడు. నిజంగా తండ్రి వచ్చింటే తన భార్యతో ఇబ్బందయ్యేది. అతని తల్లి బతికుండగా, కొడుకు ఎన్నోసార్లు అడుక్కోంగా, ఒకసారి దంపతులిద్దరూ కొడుకుదగ్గర కెళ్లారు - ఢిల్లీకి. అక్కడ కోడలు అత్తామామల్ని ముప్పుతిప్పలుపెట్టి మూడుచెరువుల నీళ్లు తాగించింది. భార్యను గదమాయించలేదు, తల్లిదండ్రులను సముదాయించలేదు. కొడుకూ కోడలు మధ్య మనఃస్పర్థలు పెరిగాయి. ఇక అక్కడ ఉండడం మంచిదికాదని భార్యాభర్తలు పల్లెకొచ్చేశారు. ఆ విషయాలన్నీ గుర్తుకు రావడంతో తండ్రి రాకపోవడమే మంచిదనుకొన్నాడు నాగిరెడ్డి.

రామయ్య రేయింబగళ్లు యంత్రంలా కష్టపడుతుంటాడు. అతనికి భార్య, ఇద్దరు కూతుండ్లు. అందరిది కష్టపడే స్వభావమే. రామయ్య మేడిపట్టి మడకదున్నుతుంటే ఒక కూతురు పారపట్టి అందచెక్కేది. ఇంకో కూతురు ఎరువు కుప్పలు చిల్లాదేది. అతని భార్య వంట చేసుకుని వచ్చేది.

రామిరెడ్డి షెడ్డుదగ్గర బండమీద కూర్చొని వాళ్లను చూస్తూ కాలం గడిపేవాడు. తామూ తమ కొడుకుతో అలా ఉంటే ఎంత బాగుండు అనుకొనేవాడు. అప్పుడప్పుడు ఈ లోకాన్ని వదిలి వెళ్లిన భార్యను, ఊరును వదిలివెళ్లిన కొడుకును తన ఆలోచనల్లోకి ఆవాహన చేసుకొని 'తను దున్నుతుంటె కొడుకు అండతీస్తున్నట్లు, భార్య సద్ది తెస్తే చెట్టుకింద చేరి కలసి మాట్లాడుకొంటూ సద్ది తాగుతున్నట్లు' ఊహించుకొంటాడు. అలాంటి సమయాల్లో "ఏంది పెదరెడ్డి నీలో నువ్వే నవ్వుకొంటాండావె" అని అడిగేవాడు రామయ్య.

"ఏం లేదులే రామయ్య" అనేవాడు. తన అందమైన ఊహలు భగ్నం చేసినందుకు రామయ్యపై చిరుకోపం కూడా వచ్చేది. తన అసమర్థతతో వాస్తవం కావలసినవాటిని ఊహల్లో తలచుకొని ఆనందిస్తున్నందుకు బాధ కలిగేది.

రామయ్య తనకివ్వాల్సిన కౌలులో ఏనాడు మోసం చేయలేదు. అంతకు ముందువరకు కూలీనాలీ చేసుకు బతుకుతుండిన రామయ్యకు కాస్త నిమ్మళం వచ్చింది. అంతో ఇంతో కూడబెట్టుకొని మరికొంత అప్పుచేసి పెద్దమ్మాయి పెండ్లిచేశాడు. ఇంక చిన్నమ్మాయికి పెండ్లికావలసి ఉంది.

"పెదరెడ్డి... ఇంగా ఏమాలోచిస్తాండావు. ఇంతకు ముందంటే కొడుకు దగ్గిరలేడని దిగులుపడతాంటివి. ఇప్పుడేమయింది" అన్నాడు రామిరెడ్డికెదురుగా మడిగెనం మీద కూర్చొంటూ రామయ్య.

ఆలోచనల్లనుంచి తేరుకొన్న రామిరెడ్డి 'అసలు విషయం' గుర్తురావడంతో అతనికి చెప్దామావద్దా అని కొంతసేపు తటపటాయించాడు.

"దరిద్దురినికి యాడికిబోయినా వడగండ్ల వానేనంట. అట్లుండాది బతుకు. బిడ్డలుంటే ఒక బాధ... లేకుంటే ఒక బాధ. చానామందికి బిడ్డల్తో సుఖమొస్తుంది. నాకుమాత్రం దు:ఖం మిగల్తాంది" అన్నాడు దిగులుగా.

"ఏమయింది పెదరెడ్డి... చినరెడ్డి మళ్లా పోతాండాడా మిల్ట్రీకి".

"అట్ల కాలబడిన్నే బాగుండు... ఈ దిగుల్లేకుండా ఉండు" అంటూ తిరిగి ఆలోచనల్లో కూరుకు పోయాడు.

రెండురోజులకు ముందు విషయాలు గుర్తుకు రాసాగాయి రామయ్యకు.

గత పదేండ్లనుంచి ఒక్కసారి కూడా రామిరెడ్డి ఆనందంగా ఉండగా రామయ్య చూసింది లేదు.

"ఏం పెదరెడ్డి... పెళ్లికొడుకు మాదిర్తొ ఉండావే" అడిగాడు.

"మా కొడుకు కోడలు రేపొస్తాండారంట. జాబొచ్చింది" అన్నాడు.

"వచ్చినా ఉంటారా పాడా, మళ్లా పొయ్యేదే కదా"

"ఇంగ పోరంట..., పద్దైదేండ్లూ అయిపోయింది" అన్నాడు సంబరంగా.

"ఇంగ నీకు ఎదురుచూసే బాధుండదు" అన్నాడు తనూ సంతోషంగా.

"ఈసారి గర్నిమిట్టమ్మ తిరణాలకు బండికట్టాల. రెండు పొట్టేండ్లు కొట్టాల. కొడుకు క్షేమంగా తిరిగొచ్చినాడంటే అయ్యన్నీచేస్తానని వాళ్లమ్మ మొక్కోనుంది. మొక్కు తీర్చుకోకుండానె ఎళ్లిపోయింది. దానిమొక్కు తీర్చాల. యాడన్నా మంచి పొట్టేండ్లు చూడు. రేటెక్కువయినా బాధలేదు" అన్నాడు రామిరెడ్డి.

రామిరెడ్డి కళ్లలో మెరుపు మాటల్లో ఉత్సాహం చూస్తుంటే రామయ్యకు ముచ్చటేసింది.

"అట్లే పెద్దరెడ్డి. చూస్తాను" అన్నాడు.

అన్నట్లుగానే నాలుగైదుచోట్ల విచారించాడు. తూర్పు హరిజనవాడలో చెంగన్న దగ్గరుండె పొట్టేండ్లు బాగుండాయి. బేరంకూడా చేసొచ్చాడు. రామిరెడ్డి ని తీసుకుపోయి చూపించాలనుకొన్నాడు. అటువంటిది, కొడుకోసం అంతగా ఎదురుచూసిన మనిషి ఇప్పుడెందుకు దిగులు పడతాండాడో అర్థం కాలేదు రామయ్యకు.

"రెడ్డీ... పెదరెడ్డీ" అనిపిల్చాడు మెల్లిగా.

"ఊc..." అన్నాడు పరధ్యానంగా.

"ఎందుకు పెదరెడ్డి అంతగా బాధపడతాండావు" అడిగాడు రామయ్య.

అంతకుముందు ఇంటివద్ద జరిగిన సంఘటనలు గుర్తొచ్చాయి రామిరెడ్డికి.

"నాయినా మన రెండెకరాల మడి అమ్మేద్దాం" అన్నాడు కొడుకు.

కుర్చీలో దర్జాగా కూర్చొని తాగుతున్న తీయటి కాఫీ చేదుగా మారింది. పొలమారింది. తిరిగి కొడుకే "మడమ్మేసి ఆరెకరాల చేన్లో కోళ్లఫారాలు పెడతాను" అన్నాడు.

"ఇప్పుడు మడెందుకురా అమ్మేది" అడిగాడు కోపంగా.

"అదున్నే ఒగటే లేకున్నే ఒగటే. మనం చేస్తాండామా పాడా" అంది కోడలు

"..... నిజమే .... ఆమడి ఉన్నే చేసే మొగాడు ఎవుడు మనింట్లో.... నువ్వా పదేండ్లాయ మేడి చేతపట్టి. నేనా.... నామాటేం చెప్తావులే. అది చెయ్యలేకే కదా మిల్ట్రీకి పోయింది. నాకొడుకా... వాడు పల్లెమొగమే చూడడు. చదువులని, ఆ తర్వాత ఉద్యోగాలని పట్నమేలే వాడింగ. మనం చేయందానికి బీటికెందుకది. అమ్మేస్తే రెండుమూడు లక్షలొస్తాయి. పల్లెకానుకొనే మనచేనుంది. దాంట్లో కోళ్లఫారాలు ఏస్తే ఎంత దుడ్డో. ఈ చుట్టుపక్కల యాడా లేవుగదా. అందరూ ఇరవై కిలోమీటర్ల దూరం పీలేరుకు పోయి తెచ్చుకొంటాండారు. చుట్టూ పల్లెలెక్కువ. మంచి దుడ్డువస్తాది" అన్నాడు భవిష్యత్‌ను కండ్లముందు ఆవిష్కరించుకొంటూ.

"మన మడినే నమ్ముకొని బతకతాండే రామయ్యోల్లు ఏంగావాల్రా?"

"వాళ్లా, మనది గాకుంటె ఇంగొకరిది అయితాది. ఏదో ఒక విధంగా బతకతార్లే. నారు పోసినోడు నీరుపొయ్యడా. అయినా ఎవరితిప్పలు వాళ్లు పడతారు. మనకెందుకు." అంది కోడలు.

"ఇప్పటికిప్పుడు ఎవరు కొంటారు" అన్నాడు కొడుకూ కోడలు కలిసే నిర్ణయం తీసుకున్నారు అనుకొంటూ.

"రాఘవరెడ్డి మామ కొంటాడంట" అన్నాడు కొడుకు.

రామిరెడ్డి మరేం మాట్లాడలేదు. అన్నీ మాట్లాడుకొనే వాళ్లు తనకు చెప్పారు. తను వద్దన్నా బాగుండదు. కొడుక్కు ఆ మడితో ఇరవై రెండేండ్ల అనుబంధమయితే తనకు అరవై ఐదేండ్లు. తను తప్పటడుగులువేసింది ఆ మడిలోనే, పరుగులు తీసిందీ ఆ మడిలోనే, జీవితం గడుపుతున్నదీ ఆ మడిలోనే అటువంటి మడిని అమ్ముతానంటాడే.

"పెదరెడ్డీ... అడుగడుక్కీ ఆలోచన్లలోకి పోతాండావే. ఏమయింది" అడిగాడు రామయ్య. గతం నుంచి వర్తమానానికి వచ్చిన రామిరెడ్డి చెప్దామా వద్దా అని కొంతసేపు ఆలోచించి ఈ పొద్దు గాకపోయినా రేపయినా తెలసేదే గదా అని. "ఈ మడి అమ్మేస్తాడంట" అన్నాడు.

"ఆc...." అన్నాడు రామయ్య.

"అవును రామయ్యా... మడి అమ్మేసి పల్లెనక చేన్లో కోళ్లఫారాలు ఏస్తాడంట" అనేసి రామయ్య ముఖంలోకి చూడలేక తప్పుచేసినవాడిలా తలొంచుకొని ఇంటికి బయల్దేరాడు.

❁ ❁ ❁ ❁ ❁

"అన్నా.. మీది ఏమద్రుష్టమన్నా... ఐదించి నీళ్లు పన్నేయే" అన్నాడు నారాయణ.

"ఆఁ.. ఐదించిల నీళ్లా...!" అడిగాడు ఆశ్చర్యంగా రామిరెడ్డి.

"అవునన్నా.... మన ఊరు ఊరంతా ఆడ్నే ఉండాది. ఏరు మాదిర్తో పోతాండాయనుకో నీళ్లు" అనేసి వెళ్లిపోయాడు.

మంచమీదనుంచి లేవలేని తన అశక్తతకు దుఃఖమొచ్చింది రామిరెడ్డికి. కొడుకు మడి అమ్మేశాడు. సంతకం చేయడానికి తనూ కోర్టుకు వెళ్లాడు. సంతకం చేసేటప్పుడు చేయి కాస్త వణికింది. వార్ధక్యం కదా అనుకొన్నాడు. అక్కడినుంచి మెల్లిగా బస్టాండు వరకు రాగలిగాడు. తమ ఊరి బస్సు ఎక్కబోయి కుప్పలా కూలిపోయాడు.

పక్షవాతం... అట్నుంచటే కలికిరి స్వామి ఆస్పత్రికిపోయి చూపించుకొని వచ్చారు. రెండు వారాలు దాటినా అనారోగ్యం పట్టు సడలించలేదు. అన్నీ మంచం మీదనే. వేళకన్నీ రామయ్య చిన్నకూతురు వచ్చి చూస్తుంటుంది. తన చేతగాని తనంవల్లనే ఆ అమ్మాయి పెళ్లి ఆలస్యమవుతోందని మరింత దిగులు పడుతుంటాడు రామిరెడ్డి. నాగిరెడ్డి మడి అమ్మడంతో రామయ్య కుటుంబానికి కూలి పనులు తప్పడంలేదు.

చేన్లో నీళ్లుపడినందుకు ఒకవైపు బాధ మరోవైపు సంతోషం. ఇంతకుముందు తన ప్రయత్నాలు తలపుకొచ్చాయి.

'తనూ రెండుసార్లు బోరువేయించాడు. నీళ్లు పడ్డాయంటే ఆరెకరాలు సాగవుతుందని ఆశపడ్డాడు. పల్లెకు తాగేనీళ్లతో ఇబ్బంది. ఎండాకాలం వచ్చిందంటే పల్లెలో ప్రభుత్వం వాళ్లు వేసిన రెండుబోర్లు ఎండిపోతాయి. 'నీళ్లబాయి' ఎండిపోయి చాలా సంవత్సరాలే అయింది. మైలుదూరం నడచిపోయి నీళ్లు తేవాల్సిందే. తమ చేన్లో నీళ్లు పడితే ఆడోళ్లు నీళ్లకోసం మైళ్లదూరం నడిచేబాధ తప్పుతుందనుకొన్నాడు. ఒకసారి పూర్తిగా బండే తెగింది. మూడువందల అడుగులకు ఆపేశాడు. రెండవసారి నాలుగువందల ఆడుగులలోతు వేయించినా ఇంచిలావు కూడా నీళ్లు రాలేదు. అరవై వేల ఖర్చు, కొడుకుచేత మందలింపుతో నిండిన ఉత్తరం మాత్రం లభించాయి. అటువంటిది ఇప్పుడు నీళ్లుపడ్డాయంటే... ఒకవైపు సంతోషం, మరోవైపు నీళ్లుపడ్డే ఆ నేలంతా పచ్చనిపైర్లతో కళకళలాడదుగదా అనే బాధ. కొడుకును అడిగి చూడాల. దాన్ని సేద్దించేస్తే ఎంత పంట పండుతుందని. ఎంతమంది కడుపులు నిండుతాయని.' అనుకొని కొడుకుకోసం ఎదురు చూడసాగాడు. మరో గంటకు కొడుకు వచ్చాడు.

"నాగా..." పిల్చాడు రామిరెడ్డి.

"ఆఁ... నాయినా మనకు నీళ్లు బళే పడ్నేయి" అన్నాడు తలుపు దగ్గరే నిల్చొని లోపలకు తొంగిచూస్తూ.

"కూచ్చో నీతో మాట్లాడాల" అన్నాడు రామిరెడ్డి.

నాగిరెడ్డి లోపలకొచ్చి మంచం అంచుమీద కూర్చొన్నాడు.

"ఐదించిల నీళ్లు పన్నేయంటగదరా... ఇంగన్నా దాంట్లో సేద్దిం చేయించు"

"సేద్దిమా... నీకేమన్నా తిక్కా... నావల్లగాదా పని. రేయింపగలు సంవత్సరమంతా కష్టపడాల. అందులో వచ్చేదెంత? ఒకోసారి పెట్టుబడి గూడా రాదు. అదే కోళ్లఫారాల్లో అయితే... లక్షలు... లక్షలొస్తాయి" అన్నాడు చిటికేస్తూ.

ఆ విషయంలో తన ఆశ అత్యాశే అని తెలుసు రామిరెడ్డికి. అయినా కొడుకు ఆలోచనల్లో ఏమన్నా మార్పు వస్తుందేమో అనే ఆశతో అడిగాడు.

"సేద్దిం చేయకుంటే పొయ్యినావు... ఊరంతటికి నీళ్ల బాధ తప్పింది" అన్నాడు రామిరెడ్డి.

"ఊరంతా కాదు నాయినా... డబ్బులుండేవాళ్లకు"

"అంటే..." అర్థంకాలేదు కొడుకు మాటలు రామిరెడ్డికి.

"అంటేనా... మనం అన్నివేలు గుమ్మరించి బోరేయించింది అందరికి ఉపరాగా నీళ్లీడానికా. బిందెకు పావలా ఇస్తేనే నీళ్లు" నవ్వుతూ చెప్పాడు నాగిరెడ్డి.

"పావలా..." నమ్మలేకుండా ఉన్నాడు రామిరెడ్డి.

"అవున్నాయినా. నూరిండ్లుండాయా ఇంటికి నాలుగు బిందెలు అయినా రోజుకు నూర్రూపాయలొస్తాది. నియ్యన్నీ ఆదాయం రాని ఆలోచన్లు. నువ్వు గమ్మునుండు" అనేసి వెళ్లిపోయాడు నాగిరెడ్డి.

❁ ❁ ❁ ❁ ❁

"పెదరెడ్డి... పెద్దరెడ్డీ..." అంటూ వచ్చాడు యల్లయ్య.

"ఏంట్రా" అడిగాడు రామిరెడ్డి.

"చినెడ్డితో చెప్పి నాకో ఎయ్యిరూపాయలిప్పించు" అడిగాడు.

"వెయ్యా!" అన్నాడు మంచంమీద కూర్చొన్న రామిరెడ్డి. ఈ రెండేళ్లలో కాస్త కోలుకున్నాడు. మెల్లిగా లేచి కూర్చోగలుగుతున్నాడు.

"అవును రెడ్డీ. వారం వారం ఇచ్చేస్తా"

"వారం వారం ఇచ్చేదేందిరా"

"అదే రెడ్డీ. తండల్‌కు ఇమ్మను. నిండు అవసరం రెడ్డి. నాభార్య పురుడుబోసుకుంది. దుడ్డవసరం" అన్నాడు వేడికోలుగా.

"సరేలే... సాయంత్రంరా. నాగిరెడ్డితో మాట్లాడతాను" అని చెప్పి పంపించాడు

యల్లయ్యను. 'తండల్..... అంటే.... తనెప్పుడో పదేండ్ల కిందట పట్నంపోయినప్పుడు అక్కడ ఇన్నాడీ మాట. వెయ్యిరూపాయలంటారు. నూర్రూపాయలు పట్టుకొని తొమ్మిది నూర్లిస్తారు. వారం వారం డెబ్బై కట్టాల. మొత్తం వెయ్యికట్టాల. అత్యాశోళ్లు కొందరు వారానికి నూరు కట్టించుకొంటారు. చాలా వడ్డీ. పల్లెలనుంచి చానా మంది పొలం పుట్రా అమ్ముకొనిపోయి పట్నాల్లో అదే వృత్తిగా బతకతాండారు. అక్కడ కూలి నాలీలను యాపారస్థులను జలగల్లా పీడిస్తున్నారు.

తండల్ తీసుకోవడం అనేది ఊబిలాంటిది. అందులో దిగితే బయటపడటం చాలా కష్టం. తనకొడుక్కూడా జలగలా మారాడా' అని ఆశ్చర్యపోయాడు. అతని ధనదాహానికి బాధ పడ్డాడు. ఇంతలో కొడుకు వచ్చాడు.

"నాగిరెడ్డి.... ఇట్లారా" అంటూ పిల్చాడు.

"ఏం నాయినా" అంటూ వచ్చాడు.

"ఇంతకు ముందు యల్లయ్య వచ్చిన్నేడురా"

"వచ్చిన్నేడా... వాడు నాప్రాణం తీస్తాండాడే. వెయ్యిరూపాయలు గావాలంట. ఇస్తే వారం వారం కడతాడా?" అన్నాడు అసహనంగా.

"నువ్వేందిరా. ఇట్లా పని చేస్తాండావు. నూటికి రెండురూపాయల వడ్డీ అంటేనే బాధపడతాండారే, నువ్వు నూటికి పదిరూపాయల వడ్డీ తీస్తాండావె. పాపం కాదంట్రా. నీకు వేరే ఏ యాపారము దొరకలేదా" అడిగాడు కొడుకును.

"వేరే యాపారమా... దేంట్లో ఉంది నాయినా ఇంత లాభం. రెండేండ్లకుముందు తెలిసింటే కోళ్లఫారాలు పెట్టేవాడ్నే కాదు. ఐదునెల్లకు ముందు తిరుపతిపోయింటి. ఆడ నాతో పాటు పన్చేసినోళ్లు ఐదారుమందుండారు. వాళ్లందరూ ఇదేపని చేస్తాండారు. వాళ్లంతా లక్షరూపాయలను ఒకటిన్నర సంవత్సరంలోనే రెండులక్షలు చేసినారు. కష్టంలేని పని. అందుకే నేనూ మొదలుపెట్టినా" అన్నాడు వివరిస్తున్నట్లుగా.

"అన్నేయం కాదంటరా"

"ఎందుకు... అవసరం వాడిది. మనం డబ్బు ఇస్తాండాము దానికి వడ్డీ వస్తుంది. అన్యాయమో, న్యాయమో... అవసరానికి ఆదుకొనేవాడు కావద్దా. ఇంగో సంగతి నాయినా ఈ ఇల్లు కొట్టేసి కొత్తిల్లు కట్టిద్దామని ఉండాను" అన్నాడు.

".... ఎందుకు" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఎందుకేముంది నాయినా, నవ్వెప్పుడో ఇరవై ఏండ్లకు ముందు కట్టించినావు. కాలం మారిండ్లే. ఇల్లు బాగలేదు"

"కాలం కాదురా... మనుషులు మారినారు. ఈ ఇంటికేమయింది. కట్టించి

ఎన్నేండ్లయినా యాడన్నా పగులొచ్చిందా, పెచ్చులూడిందా? కొట్టేదెందుకు మళ్లా కట్టేదెందుకు?" అడిగాడు కోపంగా.

"నీకు తెలీదులే నాయనా. ఇదంతా పాతకాలం మాడల్, మొన్న సంక్రాతి పండక్కు నీ మనవడు ఫ్రెండ్స్‌తో వచ్చినాడు కదా. వచ్చిన వాళ్లంతా ఇల్లు బాగలేదన్నేరంట. నీ మనవడు ఇల్లు మార్చమంటాండాడు. నీ కోడలు ఢిల్లీలో ఉండగా ఒకిల్లు చూసిందంట. తనకు చాలా నచ్చిందంట. ఆ మాడల్‌లో కట్టమంటాంది. అదీగాక ఇంటి వాస్తు గూడా బాగలేదంటలె" అని చెప్పి వెళ్లిపోయాడు.

"వాస్తు బాగలేందే వాడికి ఉద్యోగం వచ్చిందా. ఇన్నాళ్లు తమకే ఇబ్బంది లేకుండా గడిచిందా" అనుకున్నాడు మనసులో.

కొడుకు ఎటు పరుగులు తీస్తున్నాడో అర్థం కాలేదు రామిరెడ్డికి. మంచంమీదకు అలాగే వెనక్కు వాలాడు నిస్సత్తువగా. తను ఇల్లు కట్టిననాటి రోజులు కళ్లముందు మెదిలాయి.

"ఉండేది ఒక్క కొడుకు, ఇంత పెద్దిల్లు కడాతాండావే ఎందుకురా" అడిగాడు శెట్టిగారి తిమ్మారెడ్డి మామ.

"ఇల్లన్నేక ఒకనాటితో, ఒకతరంతో పోయేదా మామా? మాకుండేది ఒక నలుసే. వాడికి నలుగురయితే మళ్లా ఎతుకులాడద్దా ఇంటికోసం"

"అవునొరే. చాలా దూరం ఆలోచించినావే"

"చిన్నాయన్తో మాటలాపి పన్జూస్తావా... పొద్దు పోతాండ్లా" అంది పద్మావతమ్మ గోడలకు నీళ్లుపోస్తూ.

"ఆడోళ్లకు ఆగింతమెక్కువేరోయ్. ఎంతగా కొడుకోసరం ఇల్లు కడ్తాండారే అనుకో, అల్లుడ్ని ఐదు నిముషాలన్నా ఊరికే ఉండనిచ్చేట్లు లేవుగదమ్మా"

"అదేం లేదు చిన్నాయనా. పిల్లోడు వస్తాడు బడినుంచి. రాత్రికి ట్యూసనుకు పోవాల. అన్నంకాలా ఇంగా. ఈ మనిషి అరువులు పెట్టుకొన్నేడంటే అట్లుండె పొద్దు ఇట్లవాలినా లెయ్యడు. బిన్నే నీళ్లుతెచ్చి పోస్తే పనయిపోతాది. సందేళ టాక్టరొస్తాదంట. ఇసిక ఏసుకొని రావాల. ఈయనెళ్లిపోతాడు. మళ్లా నేనొక దాన్నే, నీళ్లకు ఇబ్బంది గదా?" అంది చేస్తున్న పనిని ఆపకుండానే.

"పిల్లోడ్ని రెండ్రోజులు బడి మాన్పించేది"

"అయ్యో... వాడ్నా... చదువుకోనీ చిన్నాయనా. బిడ్డ బాగా చదవతాండాడు. మేముండాంగదా కష్టపడేదానికి"

"తాతో... పక్కకు జరుగు ఎద్దులొస్తాండాయి" అంటూ వచ్చింది కూతురు జయలక్ష్మి. "ఈ యమ్మ మొగపుట్టక పుట్టాల్సింది. ఎట్లో ఆడదిగా పుట్టింది. మొగోని మాదిర్తా

అన్ని పనులు చేస్తాంది" అన్నాడు తిమ్మారెడ్డి.

"కష్టపడుకుంటేనే గదా మామా ఐదేళ్లు నోట్లోకి పొయ్యేది" అన్నాడు రామిరెడ్డి.

"అవున్రారే, మీతో పెట్టుకుంటె నాకు పొద్దుపోతాది. కమ్మారపల్లె దాకా పోయొస్తా" అని వెళ్లిపోయాడు.

రేయింబవళ్లు కష్టపడ్డారు... కూలీలకన్నా ఎక్కువగా! గృహప్రవేశం నాడు "ఎట్లా ఉందిరా ఇల్లు..." అడిగాడు కొడుకును.

"సూపర్ నాయినా" అన్నాడు నాగిరెడ్డి.

కొడుకు ముఖంలోని ఆనందాన్ని అతనినోట్లోంచి వెలువడిన ఇంగ్లీషు పదాన్ని చూసి మరింత ఆనందించాడు రామిరెడ్డి.

"మనూర్లో ఎవ్వరికీలేదు నాయినా ఇంత పెద్దిల్లు. చుట్టుపక్కలూర్లల్లో గూడా లేదు. బళ్లో అయితే అయివేర్లంతా 'ఏం నాగిరెడ్డీ పెద్దిల్లు కడతాండారంటనే' అనడిగినారు. మా బళ్లో పిల్లకాయలంతా చానామంది మనిల్లు చూడాలన్నేరు. ఒకరోజు పిల్చుకోనొస్తా నాయనా" అన్నాడు ఉత్సాహంగా.

కొడుకువేపు ముదిగారంగా చూశాడు. తమ శ్రమకు తగిన ఫలితం దక్కిందని సంతోషించాడు.

"అట్లేగాని.... తీసుకొనిరా" అన్నాడు.

ఆ తరువాత.తర్వాతకూడా కొడుకు తమ చుట్టపక్కాలతో, తన మిత్రులతో, అంతెందుకు మిల్ట్రీలో ఉండంగా ఇంటికొచ్చిన తనతోటి జవాన్లతోకూడా తమ ఇంటిని గురించి గొప్పగా చెప్పేవాడు. వాళ్లూ ఎంత పెద్ద ఇల్లు అంటూ ఆశ్చర్యపోయేవాళ్లు. అటువంటి ఇంటిని కొట్టేయాలంటాడే" అనుకొంటూంటే రామిరెడ్డి కాళ్లు చేతులు ఆడడంలేదు.

రామయ్యా చేత కూతురుకు కబురంపాడు. కూతురు, అల్లుడు వస్తే వాళ్ల మాటలు వినయినా కొడుకు ఇంటిని కొట్టడేమో అనే ఆశ రామిరెడ్డిలో మిణుకుమిణుకుమంటోంది.

❀ ❀ ❀ ❀ ❀

"ఏంది నాయినా... నీ చాదస్తం గాకపోతే ఇంత పెద్దఇల్లా... గోడౌన్ మాదిర్తో ఉండ్లా" అంది కూతురు.

"అవును మామా.... తలుపులు చూడు... వర్సగా ఉండాయి"

"అట్లుంటేనే గదల్లుడు గాలీ ఎల్తురొచ్చేది"

"ఈ మాదిర్తోనా.... అయినా వాస్తుబాగలేదంట గదామామా. నీకు పక్షవాతం రావడానికిక్కూడా కారణం వాస్తు బాగలేకనే అంటగదా"

"వాస్తు బాగలేకనా... ఈ ఇల్లుకట్టి ఇరవై ముప్పై ఏండ్లయితాంది. అప్పట్నుంచి

రాంది ఇప్పుడే ఎందుకొచ్చింది అల్లుడు. వాస్తు బాగలేక్కాదు నాకు పక్షవాతం వచ్చింది"

"మరి...."

"అయ్యన్నీ ఎందుగ్గానీ నాయినా.... ఇప్పుడు నీకెందుకు బాధ. ఇంతకన్నా బాగా కడ్తానుగదా ఇల్లు" అన్నాడు నాగిరెడ్డి.

"అవున్నాయినా. నువ్వేం దిగులుపడొద్దు. చూడు ఇల్లంతా దూలాలు. పాతకట్టడం కదా. ఇప్పుడు పిల్లర్లేసి దూలాలే కన్పించకుండా కడ్తాండారు. అట్ల కట్టిస్తాడంట. ఆ మాదిర్తో కట్టిస్తే నీకే గదా గౌరవం. ఫలానా రామిరెడ్డి కొడుకు గొప్పిల్లు కట్టినాడంటారు గదా... మేమొస్తాం నాయినా. వాడిష్టమొచ్చినట్లు చెయ్యనీలే" అంది కూతురు ఊరుకు బయల్దేరుతూ.

"అది కాదమ్మా..." అంటూ ఏదో చెప్పబోయాడు. మాటలు స్పష్టంగా రాలేదు రామిరెడ్డికి. తనకొస్తున్న కోపంవలన అనుకొన్నాడు.

"నువ్వేం ఆలోచన్లు పెట్టుకోవద్దు. పోయొస్తాం" అన్చెప్పి అల్లుడు కూతురు వెళ్లారు. వాళ్లతో పాటు కొడుకూ వెళ్లాడు.

కొడుకిచ్చిన కూతురు వంటిమీది రెండువేల రూపాయల విలువచేసే పట్టుచీర, అల్లుడు వేసుకోనుండె విలువైన బట్టలు వాళ్ల చేత కొడుకుపక్షం మాట్లాడించాయి – అని అర్థం చేసుకోలేనంత వెర్రివాడేం కాదు రామిరెడ్డి. జీవితాంతం పుట్టింటి ఆశ ఉండేది ఇక తమ్మునిమీదనే కదా. మంచానపడ్డ నాన్నేం మంచిచెడ్డా చూడగలడు. తెలివైంది కూతురు. అందుకే తమ్ముడ్ని వెనకేసుకొచ్చింది. అంతా బతకనేర్చినోళ్లు అనుకొన్నాడు రామిరెడ్డి.

అక్కను బావను బస్సెక్కించి ఇంటికి వచ్చాడు నాగిరెడ్డి.

రామిరెడ్డి కొడుకును పిల్చి ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు, కానీ మాట పెగలడంలేదు. అప్పుడర్థం చేసుకొన్నాడు, ఇంతకు ముందు పక్షవాతంవచ్చి కాళ్లు చేతులు మాత్రమే పడిపోయాయి. కానీ ఈసారి నోరుకూడా పోయింది అనే విషయం.

కళ్లలోంచి నీళ్లు చిక్కిపోయిన బుగ్గలపై కాలవలు గడుతున్నాయి. తుడుచుకోను చేతులు సహకరించక మరింతగా ఏడుస్తున్నాడు రామిరెడ్డి.

❁ ❁ ❁ ❁ ❁

"...... ఆ యాపారానికి ఎంతవుతాది బాబు"

"దాదాపు ఇరవైముప్పై లక్షలు పట్టచ్చుడేడీ"

"అంత డబ్బు మనకాడ యాడుంది"

"డబ్బు లేకుంటేనేం... ఇల్లు, కోళ్లఫారాలు ఉన్నాయి గదా"

"ఆదాయం వచ్చేవాటిని, తలదాచుకొనే ఇంటిని అమ్ముకోమంటావా"

"ఏంటీ డేడీ సిల్లీగా ఆలోచిస్తావ్. ఎన్ని సంవత్సరాలు కష్టపడితే కోటీశ్వరుడయ్యేది.

నేను చెప్పే బిజినెస్ స్టార్ట్ చేసినామంటె రెండు మూడు సంవత్సరాలకంతా కోటిరూపాయలు ఈజీగా సంపాదిస్తాం" అంటున్న పాతికేళ్ల కొడుకును తదేకంగా చూశాడు నాగిరెడ్డి.

కొడుకు మాటలు వింటూంటే తను తన తండ్రితో గతంలో మడి అమ్మకం గురించి, కోళ్లఫారాలు వేయడం గురించి మాట్లాడిన మాటలు గుర్తుకురాసాగాయి. అప్పుడు తండ్రి పడ్డ బాధ ఇప్పుడిప్పుడే అర్థమవసాగింది నాగిరెడ్డికి. తన కొకుడు భవిష్యత్ ఏమవుతుందో అని భయమేసింది.

*సురభి, 2001*

*విపుల మాస పత్రిక - ఆగస్ట్ 2001*

*కథ 2001*

*తెలుగు కథ - 2001*